# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మిర్చి క్వింటా రూ.11,781

### కొనుగోలుకు కేంద్రం అంగీకారం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

మిర్చి క్వింటా ధర రూ.11,781కు కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా గుంటూరు మిరప రైతులకు పెద్ద ఉపశమనం లభించిందని వివరించారు. కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద క్వింటాలుకు రూ.11,781 మద్దతు ధరకు సేకరణకు ఆమోదం తెలిపిందనీ, ధరలు తగ్గుతున్నప్పటికీ స్థిరత్వాన్ని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. ప్రారంభంలో, 25 శాతం మిర్చి ఉత్పత్తిని కొనుగోలు చేస్తారనీ, అవసరమైన విధంగా సేకరణను పెంచడానికి నిబంధనలు ఉంటాయని వివరించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసినందుకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం రైతు సమాజానికి చాలా అవసరమైన మద్దతును ఇస్తుందని వివరించారు.



# కుప్పకూలిన టన్నెల్

- 8 మంది గల్లంతు
- ముగ్గురికి గాయాలు
- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఘటన
- 14వ కిలోమీటర్ దగ్గర ప్రమాదం
- పోలీసుల సహాయక చర్యలు
- రంగంలోకి ఆర్మీ
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రులు ఉత్తమ్, జూపల్లి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- సీఎంకు ప్రధాని మోదీ ఫోన్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో శనివారం ఉదయం భారీ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా టన్నెల్ కూలడంతో 8 మంది కార్మికులు గల్లంతయ్యారు. టన్నెల్ పైకప్పు 3 మీటర్ల మేర పడిపోయింది. ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని రక్షించిన తోటి కార్మికులు హుటాహుటిన జెన్‌కో ఆస్పత్రికి తరలించారు. పోలీసుల సహాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది.

పాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పనులను ప్రారంభించింది. నాలుగు రోజుల క్రితం ఈ పనులు మొదలయ్యాయి. శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌లో భాగంగా సుమారు 50 మంది కార్మికులు సొరంగంలో పనులు చేసేందుకు వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. ఒక్కసారిగా పైకప్పు కూలి మట్టిపెల్లలు విరిగి కార్మికులపై పడ్డాయి. టన్నెల్ నుంచి 42 మంది బయటకు రాగా.. మిగతా 8 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది.టన్నెల్ పైభాగంలో మూడు మీటర్ల మేర పడిపోయింది. అధికారులు ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎడమగట్టు కాలువ టన్నెల్ ద్వారా నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టు చేపట్టారు.

ఘటనాస్థలి వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. పంజాబ్, జమ్మూ, యూపీ, జార్ఖండ్‌కు చెందిన కార్మికులు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. గుర్‌జీత్ సింగ్(పంజాబ్), సన్నీత్‌సింగ్ (జమ్ముకశ్మీర్), శ్రీనివాసులు (యూపీ), మనోజ్ రూబెన (యూపీ), సందీప్ (ఝూర?ండ్), సంతోష్ (ఝూర్ఖండ్), జట్కా హీరాన్ (ఝూర్ఖండ్) గుర్తించారు. అయితే బోల్టులు ఊడిపోవడంతో సిమెంట్ సెగ్మెంట్‌లు కూలాయి.

**8 మందిని కాపాడేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నాం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు చేరుకున్నారు. టన్నెల్ దగ్గర పరిస్థితిని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నకార్మికులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కార్మికులు సొరంగం లోపలికి వెళ్లారని, ఉదయం 8.30 గంటలకు బోరింగ్ మెషీన్ ను ఆన్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 20 మీటర్లు డ్రిల్లింగ్ చేయగానే టన్నెల్ లోకి నీళ్ల లీక్ అయ్యాయని వివరించారు. టన్నెల్ లో ఒకవైపు నుంచి నీరు లీక్ కావడంతో మట్టి కుంగిపోయిందని తెలిపారు. బోరింగ్ మెషీన్ ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టాడని, దాంతో బోరింగ్ మెషీన్ వెనకున్న 42 మంది కార్మికులను బయటికి పంపించివేశారని మంత్రి వెల్లడించారు. బోరింగ్ మెషీన్ కు ముందున్న 8 మంది బయటికి రాలేక టన్నెల్ లోపల చిక్కుకున్నారని తెలిపారు. వారిలో ఇద్దరు విదేశీ ఇంజినీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. విదేశీ ఇంజినీర్లు మినహా మిగిలిన వారు యూపీ, ఝూర్ఖండ్ కు చెందిన వారు అని వివరించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో కాపాడేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. 14 కిలోమీటర్ల లోపల ఉన్నందున సహాయ చర్యలు క్లిష్టంగా మారాయని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్స్ లో నిపుణులైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## కులగణనపై కుట్రలు

- బీసీల లెక్క తేలితే వాటా అడుగుతారని వారి భయం
- బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కులగణనపై కుట్రలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో కులగణన చేయడం ఇష్టం లేకనే బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బీసీ నేతలతో ఆయన సమావేశమై రిజర్వేషన్ల అమలుపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన చేయాల్సిందేనని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాట మేరకు చేసి చూపించామని అన్నారు. "సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడకగా ఉందనే.. ఆనాటి ప్రభుత్వం లెక్కలను బయటపెట్టలేదు. అందుకే ఆ వివరాలను ఎన్నికల కోసం వాడుకున్నారే తప్ప..ప్రజల కోసం వినియోగించలేదు.. కానీ మేం చిత్తశుద్ధితో కులగణనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. చట్టపరంగా ఇబ్బందులు కలగకుండా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించి కులగణనను పకడ్బందీగా నిర్వహించాం. ఏ బ్లాక్‌లో ఏ ఇంట్లో తప్పు జరిగిందో నిరూపించాలని కేసీఆర్, బండి సంజయ్, కిషన్ రెడ్డికి సవాల్ విసురుతున్నా. ప్రక్రియను తప్పుబట్టడం ద్వారా మొత్తం వ్యవస్థను కుప్పకూల్చేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇది బీసీ సోదరులు గమనించాలి. స్వతంత్ర భారత దేశంలో ఎవ్వరూ ఇప్పటివరకు కులగణన చేపట్టలేదు. ఒక్కసారి బీసీల లెక్క తేలితే వాటా అడుగుతారనే భయంతో దీనిపై కొందరు కుట్ర చేస్తున్నారు. బీజేపీలో ఉన్న ఒకటి రెండు ఆధిపత్య సామాజిక వర్గాలకు నష్టం జరుగుతుందనే నెపంతో కులగణనపై కుట్రలు చేస్తున్నారు. కేసీఆర్ సర్వే ప్రకారం బీసీలు 51 శాతం మాత్రమే. కానీ తాము చేసిన కులగణన ప్రకారం 56.33 శాతంగా ఉన్నారు. కులగణనలో వారి లెక్క తగ్గిందో, పెరిగిందో బీసీ సామాజికవర్గం ఆలోచించాలి. తమ సర్కార్ చిత్తశుద్ధితో అమలు చేయాలని కులగణనను చేపట్టింది. దీన్ని పట్టాలెక్కించి గమ్యం చేర్చే వరకు ముందుకు తీసుకెళ్లే బాధ్యత మీదే' అని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశంలో బీసీ రిజర్వేషన్ల గురించి చర్చించాలంటే తెలంగాణ గురించి, చర్చించుకునే పరిస్థితి ఉంటుందని సీఎం చెప్పారు. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే చరిత్ర క్షమించదని అభిప్రాయపడ్డారు. మోదీ రాజకీయ ంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే ఈ ప్రక్రియను తప్పుబడుతున్నారని విమర్శించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తమ ఉద్యోగాలు పోతాయనే భయంతో దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. దీన్ని రాష్ట్రంలోని అన్ని బీసీ సామాజిక వర్గాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. జనగణనలో కులగణన చేర్చాలని సామాజికవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించి మార్చి 10లోగా తీర్మానాలు చేయాలని సీఎం వారిని కోరారు.

## ప్రమాదంపై సీఎం రేవంత్ సమీక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిసమీక్షించారు. ఘటన స్థలాన్ని సందర్శించి వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యల్లో మరింత వేగం పెంచాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సూచించారు. గాయపడ్డ వారి పరిస్థితిని ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించాలని చెప్పారు. ఎన్‌డీఆర్ఎఫ్ , ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రమాద స్థలికి చేరుకున్నాయని మంత్రి వివరించారు. సహాయక చర్యల విషయంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని ఫోన్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. ముఖ్యమంత్రి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రధానమంత్రికి తెలియజేశారు. సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టామని ప్రధానికి వివరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావుదగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని ప్రధానమంత్రి గారికి చెప్పారు. సహాయక చర్యల కోసం వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తామని మోదీ ముఖ్యమంత్రికి తెలిపారు. పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి వెంటనే మంత్రులను, అధికారులను అప్రమత్తం చేశారు. ఉదయం నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, జూపల్లి కృష్ణారావు గారితో పాటు డీఐజీ, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను హుటాహుటిన ప్రమాదస్థలికి పంపించారు.

## నడిరోడ్డుపై తండ్రి దారుణ హత్య

- తాగొచ్చి వేధిస్తున్నాడని..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ప్రతిరోజూ తాగొచ్చి ఇంట్లో వారిని వేధింపులకు గురిచేస్తున్నాడని పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా కన్న కొడుకే తండ్రిపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. .సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి(45), అతడి కుమారుడు సాయి కుమార్‌ప్యాకర్స్ అండ్ మూవర్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. మొగిలి మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం సేవించి కొడుకు ఆరెల్లి సాయికుమార్‌తోపాటు ఇంట్లో వారిని మానస ికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతున్నాడు. ఎన్నిసార్లు మందలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం తన తండ్రి మొగిలి పూటుగా మద్యం సేవించినట్టు సమాచారం అందుకున్న సాయికుమార్ కోపంతో తండ్రికోసం గాలించాడు. అయితే ఈసీఐఎల్ బస్టాండ్ వద్ద తన తండ్రి ఉన్నాడని తెలుసుకొని అక్కడి వెళ్లాడు. తండ్రిని చూడగానే విచక్షణ కోల్పోయిన కుమారుడు.. తనతో తీసుకొచ్చిన కత్తితో పలుమార్లు తండ్రి కడుపులో పొడిచాడు. దాంతో తీవ్రంగా గాయపడిన మొగిలి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు మొగిలిని ఈసీఐఎల్ శ్రీకర్, రాఘవేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మొగిలి మృతిచెందాడు. సాయికుమార్ సోదరుడు అరెల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

## అంగన్వాడీల్లో 14236 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

బలగం టీవీ, హైదరాబాద్



రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్ మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

## కాంగ్రెస్ పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి




- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నట్టు మీరు విడుదల చేసిన నివేదికనే చెబుతోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

రేవంత్ రెడ్డి ఇప్పటికైనా రంకెలు వేయడం మానేసి దమ్ముంటే కాంగ్రెస్ పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే మా సవాల్‌ను స్వీకరించాలని కేటీఆర్ అన్నారు. నాలుగు కోట్ల ప్రజల ముందు.. అసెంబ్లీ సమావేశాల్లోనే నీ బట్టలు


మిగితా 2వ పేజీలో


## స్కూల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

**టీచర్ మందలించాడని..**

బలగం టీవీ, హైదరాబాద్

టీచర్ మందలించాడని స్కూల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మేడ్చల్ మల్కాజిగిరి ఉప్పల్‌లో చోటుచేసుకుంది. ఉప్పల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ ద్వారకా నగర్ కు చెందిన ధర్మారెడ్డి సంగీత దంపతులు. వారి రెండో కుమారుడు ఎం. సంగారెడ్డి ఉప్పల్ సాగర్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువు తున్నాడు. శనివారం ఉదయం స్కూల్లో సీసీ కెమెరాను అతను మార్చాడని తోటి విద్యార్థుల ముందు పీఈటీ ఉపాధ్యాయుడు మందలించాడు. దాంతో అవమానానికి గురైన బాలుడు మనస్తాపం చెందాడు. వాష్ రూమ్‌కని చెప్పి వెళ్లి స్కూల్ భవనంపైకి ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకు న్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. తమ కుమారుడు మృతికి ఉపాధ్యాయుల వేధింపులే కారణమంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సాగర్ గ్రామర్ ఉన్నత పాఠశాల సీజ్**

ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో ఉన్న సాగర్ గ్రామర్ ఉన్నత పాఠశాలను సీజ్ చేసినట్టు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి ఐ.విజయకుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై ఉప్పల్ ఎంఈఓ ద్వారా విచారణ చేపట్టి అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్‌ను సీజ్ చేసినట్టు డీఈఓ తెలిపారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన బాలుడు మృతి

బలగం టీవీ, హైదరాబాద్




లిఫ్టుకు – స్లాబ్‌కు మధ్య ఇరుక్కున్న ఆరేళ్ల బాలుడు అర్నవ్ నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మాసబ్ ట్యాంకు, శాంతినగర్‌లోని మఫర్ కంఫర్టెక్ అపార్టుమెంటులో లిఫ్ట్ డోర్ కు గోడకు మధ్య 6 సంవత్సరాల అర్నవ్ ఇరుక్కున్నాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఎంతో కష్టపడి బాలుడి బయటకు తీసి నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అయితే దాదాపు 2 గంటల పాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోవడంతో బాలుడు పొత్తికడుపు నలిగిపోయిం దని, అంతర్గత రక్తస్రావం అవుతున్నట్టు గుర్తించిన డాక్టర్లు ఆపరేషన్ చేశారు. అతనికి వెంటిలేటర్‌పై కృత్రిమ శ్వాస అందించి ప్రాణాలను నిలిపేందుకు ప్రయత్నించారు. కానీ శనివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించడంతో బాలుడు మృతి చెందాడు. మతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## కుంభమేళాలో 60 కోట్ల మంది పుణ్యస్నానం

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో



మహాకుంభమేళా సందర్భంగా త్రివేణి సంగంలో 60 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానం ఆచరించారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం శనివారం వెల్లడించింది. మహాకుంభమేళా జనవరి 13 మొదలయింది. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా ముగియనున్నది. ఇండియాలోని 110 కోట్ల సనాతన ధర్మం ఆచరించే వారిలో సగం మంది ఇప్పటికే గంగా,యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ప్రపంచ జనాభాను సమీక్షించే ప్యూ రీసెర్చ్ ప్రకారం భారత దేశ జనాభా 143 కోట్లు(1.43 బిలియన్). వారిలో 110 కోట్ల (1.10 బిలియన్) మంది సనాతన ధర్మాన్ని ఆచరించే జనం ఉన్నారు. అంటే మహాకుంభమేళాలో ఈపాటికే 55 శాతం మంది సనాతనులు నదీ పుణ్య స్నానం ఆచరించారు. సీతా దేవి(జానకి అమ్మవారు) జన్మస్థలం అయిన నేపాల్ నుంచి 50 లక్షల మంది కంటే ఎక్కువ మంది పుణ్యస్నానం ఆచరించారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది. ఫిబ్రవరి 18 నాటికే 55 కోట్ల మంది భారతీయులు సంగంలో స్నానం ఆచరించారు. రానున్న మహాశివరాత్రి స్నానానికి ఈ సంఖ్య 65 కోట్లు(650 మిలియన్) దాటుతుందని యుపి ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే మౌని అమావాస్య, మకర సంక్రాంతి, బసంత్ పంచమి సందర్భంగా కోట్లాది మంది పుణ్యస్నానం ఆచరించారన్నది గమనార్హం.

## సీఎంకు విద్యా కమిషన్ నివేదిక అందజేత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై విద్యా కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, చారగొండ వెంకటేష్, జ్యోత్స్నా శివారెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌ని కలిసి నివేదికను సమర్పించారు. ప్రీప్రైమరీ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు సాంకేతిక విద్యతో పాటు సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయగా, కమిషన్ ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు, పాఠశాల నిర్వహణ సమస్యలను సీఎం వివరించారు. విద్యా విషయాల్లో అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతోపాటు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# వేసవిలో నీటి సమస్యలు రాకుండా చూడాలి

- విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలి
- మిషన్ భగీరథ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి సీతక్క
- మిషన్ భగీరథపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సచివాలయంలో మిషన్ భగీరథపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరా వివరాలను మంత్రికి అధికారులు నివేదించారు. ఇప్పటి వరకు ఎక్కడా తాగునీటి సమస్య లేదని అధికారులు తెలిపారు. ఏదేని గ్రామంలో సమస్యలు తలెత్తిన వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నామని అధికారులు




పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి తాగునీటి సమస్యలు లేకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలి.. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంప్ హౌస్ మోటర్లలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. ఈఎన్సీ నుంచి గ్రామ స్థాయి వరకు మిషన్ భగీరథ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు తాగు నీటి సరఫరాపై జిల్లా అధికారులతో సమీక్ష చేపట్టి నివేదిక సమర్పించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎక్కడైన సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణం పరిష్కరించాలని మంత్రి అధికారులకు తెలిపారు. సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలున్నందున, ఈ వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఫండ్ కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

విప్పుతాం.. మేం చెప్పినవి తప్పని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నట్టు మీరు విడుదల చేసిన నివేదికనే చెబుతుంది. మరి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏదాడిలో నువ్వు ఏం చేశావంటే.. రేవంత్‌కు చెప్పేందుకు మ్యాటర్ లేదు. మేం(బీఆర్ఎస్) దిగిపోయేనాడు ఉన్న రేషన్ కార్డుల సంఖ్య 89 లక్షల 97 వేలు అని భట్టి విక్రమార్కనే చెప్పిండు. మరి కొత్తగా ఏమన్న ఇచ్చారంటే.. లక్ష కార్డులు తొలగించామని చెప్పారు. కొత్తవి ఇవ్వకుండా ఉన్నవి కట్ చేసిండ్రు అని కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి అనేటోడు ఇన్ని పచ్చి అబద్ధాలు చెప్తడు అని అనుకోరు. సీఎం చెప్పిన పచ్చి అబద్ధాలను డిప్యూటీ సీఎం ఎండగట్టి ఉతికి ఆరేశారు. అప్పులకు మిత్తీలకు నెలకు రూ. 6500 కోట్లు కడుతున్నాం అని రేవంత్ రెడ్డి చెప్పిండు. నేను చెప్పింది తప్పయితే ఏ శిక్షకైనా సిద్ధం. మిత్తీలకు పోయిన పది నెలలకు 22 వేల 56 కోట్లు కట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. నెలవారీ లెక్క కూడా ఇందులో ఇచ్చారు.. నెలకు పోయిన ఏప్రిల్ నుంచి మొన్న జనవరి వరకు 22 వేల 56 కోట్లు. అంటే నెలకు 2200 కోట్లు అని భట్టి విక్రమార్క చెబుతుండు. మరి నెలకు 6500 కోట్లు కడుతున్నాని బోగస్ ముఖ్యమంత్రి చెబుతుండు. 4300 కోట్లు ఎక్కడ పోతున్నాయి. టకీటకీమని రైతుబంధు పడుతలేదు. తులం బంగారం వస్తలేదు.. టకీటకీమని రాహుల్ గాంధీ ఖాతాలో పడుతున్నాయో చూడాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

మిత్తీలు మాకు అప్పజెప్పినప్పుడు.. 2014లో రాష్ట్ర ఆదాయంలో 21.64 శాతం. 2023లో కేవలం 17.19 శాతం మాత్రమే. ఈ విషయం ఎందుకు చెప్పడం లేదు. రాష్ట్రాన్ని అద్భుతంగా అప్పజెప్పితే.. మీరు ఆగం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక లోటు గరిష్టానికి పడిపోయిందని ఇవాళ వార్తలు. దివాళకోరు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే.. వీరి అసమర్థ పాలనలో తెలంగాణ చేతికి చిప్ప వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే జనవరి నెలఖారు వరకు రెవెన్యూ ఆదాయం ఒక లక్ష 23 వేల 815 కోట్లు సంపాదించుండ్రు.. కానీ ఖర్చు పెట్టింది.. ఒక లక్షా 49 వేల 866 కోట్లు. అంటే రాబడి కంటే ఖర్చు ఎక్కువ ఉంది. కొత్త స్కీం ప్రారంభించలేదు. రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు, స్కూటీలు, తులం బంగారం లేవు, పెన్షన్లు లేవు.. మరి ఎందుకు ఖర్చు పెరిగింది.. ఎందుకు అప్పు చేస్తున్నారో చెప్పగలరా..? మీకు మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పజెప్పితే నువ్వు ఒక ఏడాదిలో ఒక లక్షా 41 వేల కోట్లు అప్పు జేశావు. రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల హైడ్రాతో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నది. రిజిస్ట్రేషన్లు తగ్గాయి. రియల్ ఎస్టేట్ రంగానికి పొడిచిన వెన్నుపోటు కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రేవంత్ రెడ్డికి రాజకీయ కక్షలు తెలుసు తప్ప రాష్ట్రాన్ని ఆర్థికంగా బాగు చేయాలనే సోయి లేదు. వ్యవసాయాన్ని చావుదెబ్బ కొట్టావు. వ్యవసాయం సంక్షోభంలో పడింది. పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. కేసీఆర్ మీద కోపంతో మేడిగడ్డ రిపేర్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని కేటీఆర్ మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ కూడా పూర్తిగా ఆరు గ్యారెంటీలు అమలు చేసిన దగ్గరే పోటీ చేయాలి అనవచ్చు. పూర్తిస్థాయి రుణమాఫీ అయిన దగ్గర.. రైతుబంధు వచ్చిన దగ్గర ఆడబిడ్డలకు 2500 వచ్చిన దగ్గర పెంచిన పెన్షన్లు ఇస్తున్న దగ్గర మాత్రమే కాంగ్రెస్ పోటీ చేయాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తా అన్న దగ్గర ముఖ్యమంత్రి ఓట్లు అడగాలి. ఇప్పటికే స్టార్టర్లు, మీటర్లు, డోర్లు ఎత్తుకపోతున్నరు. రేపు రేపు ఆడబిడ్డల పుస్తెలతాడు కూడా రేవంత్ రెడ్డి ఎత్తుకపోతడు అని పేర్కొన్నారు. తన చేతగానితనంతో కేవలం ఒక్క సంవత్సరంలోనే అన్ని రంగాలను రేవంత్ రెడ్డి సావు దెబ్బ కొట్టిండు. ఇది రాష్ట్ర ఆర్థిక లోటు కాదు.. రేవంత్ రెడ్డి వల్ల వచ్చిన తలపోటు. రాష్ట్రంలో కొత్త నిర్మాణాల పైన ఒక్క స్క్వేర్ ఫీట్‌కి 150 రూపాయలు వసూలు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి తెలంగాణ దివాలా తీస్తుందని ఒకటే తీరుగా ప్రచారం చేసిండు. ముఖ్యమంత్రి, మంత్రులు తెలంగాణ నాశనమైందని చెప్తూ వస్తున్నారు. తన సొంత రాష్ట్రానికి క్యాన్సర్ వచ్చిందని చెప్పిన దివాళా కోరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కడే అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. బండి సంజయ్‌కు చేతనైతే ఆర్‌ఆర్ టాక్స్‌పై చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే అమృత్ స్కాం నుంచి మొదలుకొని అనేక స్కామ్స్ పైన కేంద్రానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. అసలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతుంది? రేవంత్ రెడ్డి బిజెపిలో చేరుతానని ఏమైనా లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారా అన్న విషయాన్ని స్పష్టం చేయాలి.సుంకిశాల ప్రమాదంలో కూడా రేవంత్ రెడ్డి ఎవరిని కాపాడుతున్నాడో తెలుసు? సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపైన సమాచార హక్కు అడిగితే దేశ భద్రత అని రేవంత్ రెడ్డి కాంటాక్టర్‌ను కాపాడుతున్నారు. కృష్ణాజలాలపైన కేవలం ఉత్తరం రాసి చేతులు దులుపుకున్నారు. కృష్ణాజలాల్లో న్యాయమైన వాటా కోసం కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి ఉద్యోగం పోతదని రేవంత్ రెడ్డి భయపడుతున్నాడు. కృష్ణా జలాల దోపిడీపైన రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడుతాం అని కేటీఆర్ అన్నారు.

## ఇద్దరు ఐపీఎస్‌లు రిలీవ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష్ బిస్తా, అభిషేక్ మహంతీలను రిలీవ్ చేయాలని కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముగ్గురు అధికారులను వెంటనే ఆంధ్రాకు రిపోర్టు చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే రోడ్డు భద్రత డీజీగా కొనసాగుతున్న అంజనీకుమార్, పోలీస్ ట్రైనింగ్ డిజిగా ఉన్న మరో ఐపీఎస్ అధికారి అభిలాష్ బిస్తాలను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది.. ఈ ఇద్దరు అధికారులు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపిలో రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశించింది.. ఇక ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిషేక్ మహంతిని రిలీవ్ అంశాన్ని పెండింగ్ లో ఉంచింది.. ప్రస్తుతం ఆ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండగా కోడ్ అమలవుతున్నది.. దీంతో ఆయన రిలీవ్ విషయంలో ఎన్నికల సంఘానికి లేఖ రాసింది.. అక్కడి నుంచి సమాధానం వచ్చిన తర్వాత అభిషేక్ రిలీవ్ పై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది..

### ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం..

## కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పసుపు బోర్డుకు చట్టబద్ధత లేదు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్రం పేరుకే గెజిట్ జారీ చేసి పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని, కానీ పసుపు బోర్డుకు చట్టబద్ధత లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలోని పసుపు మార్కెట్ యార్డును ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పసుపు రైతుల సమస్యలు, పసుపు ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పసుపు ధరలు పడిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచివచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయని, స్థానికంగా పసుపునకు మంచి రేటు వస్తుందని తెలిపారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి పసుపు ధర తగ్గిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగైదు రోజులు వేచి చూసినా పసుపు కొనడం లేదని, ఒక రకంగా రైతును బ్లాక్‌మెయిల్ చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నదని ఆరోపించారు. ఎంత మంచి నాణ్యత గల పసుపునకు అయినా మంచి ధర ఇవ్వడం లేదని, రూ.12 వేల కనీస ధర కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని అన్నారు. అంతకు తక్కువ ధర ఉంటే మిగతా డబ్బును బోనస్ రూపంలో ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, తక్షణమే పసుపునకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత, కనీస మద్దతు ధర కోసం కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. మార్చి 1లోపు బోనస్ ప్రకటించకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. బనకచర్ల నుంచి మన నీటిని ఏపి ఎత్తుకుపోతుంటే మూర్ఖపు ముఖ్యమంత్రి చూస్తూ నిలబడ్డారంటూ రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. తెలంగాణ హితం కోరితే ఎపి సిఎం చంద్రబాబు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేంద్రానికి ఎందుకు లేఖ రాయం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతుల కంటే చంద్రబాబుపై ఎక్కువ ప్రేమ ఉందా అంటూ ధ్వజమెత్తారు. రైతుల ఉసురు తీసి గోదావరి, కృష్ణా జలాలను ఇచ్చి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా అని నిలదీశారు.

## సీఎం రేవంత్ రెడ్డి సవాలు విసరడం హాస్యాస్పదం

- కేంద్రమంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ ను స్వీకరిస్తున్నానని కేంద్రమంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. అయితే సిఎం చర్చకు రమ్మనడం హాస్యాస్యపదంగా ఉందని, అసలు ఇంతకి దేనిపై చర్చించాలని ప్రశ్నించారు. హామీల వరకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమని, దేనిపై చర్చకు రావాలో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు, 6 గ్యారంటీల అమలు సంగతి దేవుడెరుగు కానీ కాంగ్రెస్ పాలన పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి సవాలు విసరడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అరచేతిలో వైకుంఠం చూయిస్తూ ఇదే మా పరిపాలన అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏం చేశారని చర్చకు రావాలని సీఎంను మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవిష్యత్తుకు ఈ మండలి ఎన్నికలు దిశా నిర్దేశం చేయనున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, 420 సబ్ గ్యారంటీలలో కొంత మేరకైనా అమలు చేసి బహిరంగ చర్చకు వస్తే బాగుంటుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు వెంటనే అమలు చేస్తామని గొప్పలు చెప్పి ప్రభుత్వం ఏర్పడి 400 రోజులు పూర్తి కావస్తున్న ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. అందుకే శాసనమండలిలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై నిలదీయాలంటే తెలంగాణ సమాజం భారతీయ పార్టీని ఆదరించి ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి...

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , వేములవాడ**

విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలోని నిర్మలా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో నిర్వహించిన స్పోర్ట్స్ డే సెలబ్రేషన్ కి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై స్పోర్ట్స్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎంత పెద్ద ఇబ్బందులు ఎదురైన దృఢంగా ఉంటారని,క్రీడల వల్ల మానసిక ఉల్లాశం శరీరక దృఢత్వం లభిస్తుందన్నారు.ఆనాడు చదువుకుందాం అంటే సౌకర్యాలు లేవు అని, ఇప్పుడు సకల సౌకర్యాలు ఉన్నాయని అన్నారు.చక్కగా చదువు లో రాణించి మీ




తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. విద్యార్థులు మంచిని స్వీకరించి,చెడును వదిలేయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులలోని సృజనాత్మను వెలికి తీసి వారిని ఆయా రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని అన్నారు . పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రాధన్యత ఇవ్వాలని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో విద్యావ్యవస్థల పెను మార్పులు తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని,రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జరుగుతుందన్నారు... విద్యార్థులు విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు రాణించాలని పిలుపునిచ్చారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,సైబర్ క్రైమ్ నేరాలకు గురైతే www.cyber-crime.gov.in నందు రిపోర్ట్ చేయండి లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ కి పిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు క్రిప్టో/ బిట్ కాయిన్ ఫ్రాడ్, పరమిడ్/ మల్టీ లెవల్ మార్కెటింగ్ ఫ్రాడ్, జంప్డ్ డిపాజిట్ ఫ్రాడ్,నకిలీ విద్యుత్ బిల్లుల మోసాలు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, రుణ యాప్‌ల మోసాలు,ఆన్లైన్ పే మెంట్స్ అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్ ఫ్రేడ్స్ లోన్ యాప్ ల, ఓటీపీ, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్, నకిలీ సిమ్ కార్డ్స్, లోన్ యాప్స్, అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్,నకిలీ వెబ్ సైట్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.సైబర్ నేరాలకు గురైతే వెంటనే www. cybercrime. gov.in, లేదా సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 పిర్యాదు చేయాలని తెలిపారు.

# ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి



**బలగం టీవీ , సిరిసిల్ల**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భారత స్వాతంత్ర్య సమరంలో ప్రథమ వీరుడు గా చరిత్రలో నిలిచారని,1846లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన తొలి నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ధైర్యం, త్యాగం నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కోర్ కమిటీ సభ్యులు-కనిమెని చక్రధర్ రెడ్డి,బాణపురం రంగారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, గుళ్ళపల్లి నర్సింహారెడ్డి,కోశాధికారి ఏడమల హన్మాంతరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ-బీమా నీలిమా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్-మడుపు ప్రేమ్ సాగర్ రెడ్డి, ,ఉప్పుల లక్ష్మారెడ్డి, ఏడమల భూపాల్ రెడ్డి లు పాల్గొన్నారు.



# నారాయణపూర్‌లో ఘనంగా హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం గ్రామంలో హనుమాన్ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గణపతి హెూమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మంగళహారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ఏడాది పాలనలో జరిగింది..

**-ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ఏడాది పాలనలో జరిగిందని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థలో చాలా మార్పులు తీసుకువచ్చామని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ అన్నారు.శనివారం వేములవాడ పట్టణంలో పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తో కలసి పట్టణ పరిధిలోని పలు పాఠశాలల్లో, కళాశాలలో లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రులు మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత గా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి బారీ మెజారిటీతో గెలిపించాలని,నరేందర్ రెడ్డి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు ఎంతో సేవచేస్తున్నారని అన్నారు.



మూలవాగులో, గుడిచెరువులో మురికి నీరు కలవకుండా సుమారు 9 కోట్ల పై చిలుకు నిధులతో ప్రత్యేక ప్రణాళికలతో గుడి చెరువు లో మూల వాగులో మురికి నీరు కలవకుండా కాలువల నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందని,ప్రజా ప్రభుత్వంలో ఐటీఐ లను ఏ టి సి లుగా మార్చడం జరిగిందని అన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ఏడాది పాలనలో జరిగిందని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, రైతు భరోసా, రైతు రుణ మాఫీ 500 గ్యాస్ సిలిండర్‌ను చేశామని అన్నారు.



# పవర్లూమ్ కార్మికుల ధర్నా విజయవంతం చేయండి

**- తెలంగాణ పవర్లూమ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్**

**బలగం టీవీ , సిరిసిల్ల**

ఫిబ్రవరి 24న పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం వద్ద నిర్వహించే ధర్నా లో పెద్ద ఎత్తున పవర్లూమ్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ పవర్లూమ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేట లో పవర్లూమ్ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం చంద్రంపేట పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ము శం రమేష్ మాట్లాడుతూ పాలిస్టర్ కార్మికుల కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల కూలీ పెంచకపోవడంతో పెరిగిన ధరలకు వేతనాలు సరిపోక కార్మికులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ, అప్పుల పాలవుతున్నారని అన్నారు.ప్రస్తుత ధరలకు అనుకూలంగా నెలకు రూ.20,000 వేతనం వస్తేనే కుటుంబం అంతంత మాత్రాన గడిచే పరిస్థితి ఉన్నదని,పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు నెలకు పదివేల వేతనం కూడా రావడం లేదని అన్నారు.కార్మికులు ఇంత తక్కువ వేతనంతో ఎలా బతుకుతారో యజమాన్యం ఆలోచించడం లేదని,అధికారులు ప్రభుత్వంపట్టించుకోవడం లేదని అన్నారు.పవర్లూమ్ యజమానుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్న ప్రభుత్వం, కార్మికులకు యజమానులు ఏరకంగా కూలీ ఇస్తున్నారు,తక్కువ ఇస్తున్నారా,ఎక్కువ ఇస్తున్నారా అని తెలుసుకోవడం లేదని అన్నారు.

కార్మికులు కూలి పెంచమని అడుగుతే యజమానులు లాభాలు లేవని పరిశ్రమలు మూసివేస్తామని అంటున్నారని అన్నారు. ఇచ్చే కూలీకి పనిచేస్తేనే పని ఇస్తాము అనే యజమానుల చెప్పే విధానం సరియైనది కాదని, పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనం వచ్చే విధంగా కూలి పెంచి ఇవ్వాలని,కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఒగ్గు గణేష్ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నక్క దేవదాస్, కార్మికులు పాల్గొన్నారు

# పవన్ కల్యాణ్ హెల్త్ చెకప్

**బలగం టీవీ , హైదరాబాద్**

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అపోలో వైద్య సిబ్బంది పవన్ కు స్కానింగ్, ఇతర పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్స్ పరిశీలించిన వైద్యులు పవన్ కు పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నెలాఖరున గానీ, మార్చి మొదటి వారంలో గానీ మిగిలిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని పవన్ నిర్ణయించుకన్నారు.






# పాకిస్థాన్‌లో జనగణమన

**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆశ్చర్యకర ఘటన చోటు చేసుకున్నది. లాహెూర్‌లోని గడాఫీ స్టేడియంలో ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య మ్యాచ్ జరుగుతున్నది. మ్యాచ్‌కు ముందు మ్యాచ్‌లో పాల్గొనే జట్ల జాతీయ గీతాలాపన జరిగే విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్ల క్రికెటర్లు జాతీయ గీతాపాలన కోసం నిల్చున్నారు. ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులుగా నిర్వాహకులు భారత దేశ జాతీయ గీతాన్ని ప్లే చేశారు. దాంతో స్టేడియంలో అభిమానులంతా కేకలు వేశారు. ఆస్ట్రేలియా క్రికెటర్లు సైతం ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత వెంటనే తప్పును గ్రహించిన నిర్వాహకులు భారత జాతీయ గీతాన్ని నిలిపివేసి.. ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని ప్లే చేశారు. అయితే, అప్పటికే భారత జాతీయ గీతంలోని 'భారత భాగ్య విధాత' వరకు ప్లే అయ్యింది.




# 'ఓదెల-2' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

2022లో వచ్చిన ఓదెల రైల్వేస్టేషన్ మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఓదెల-2పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ప్రముఖ డైరెక్టర్ సంపత్ నంది కథ అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీ టీజర్‌ను తాజాగా మేకర్స్ మహాకుంభ మేళాలో విడుదల చేశారు. తమన్నా లేడీ అఘోరాగా కనిపించిన ఈ టీజర్ ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలతో ఆకట్టుకుందనే చెప్పాలి. శివశక్తిగా తమన్నా నటన ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా సాగింది. సంపత్ నందితో కలిసి మధు క్రియేషన్స్ పతాకంపై డి. మధు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజనీశ్ లోక్‌నాథ్ బాణీలు అందిస్తున్నారు. టీజర్ చూస్తుంటే.. ఓదెల గ్రామాన్ని దుష్ట శక్తుల నుంచి నాగ సాధువు అయిన తమన్నా ఎలా రక్షిస్తుంది అనే కథాంశంతో ఈ సినిమా రాబోతుంది. ఇక టీజర్ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే శివ భక్తి గీతం గుస్ బంప్స్ తెప్పించేలా ఉండగా.. తమన్నా యొక్క నాగ సాధువు లుక్, ఆమె తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి.

# 'యుగానికి ఒక్కడు' రీ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




తమిళ నటుడు కార్తి నటించిన 'యుగానికి ఒక్కడు' చిత్రానికి తెలుగులో మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. అయితే, ఆ సినిమాకు థియేటర్లలో కంటే కూడా టీవీల్లో సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. కార్తి యాక్టింగ్, ఆయన చెప్పిన డైలాగులకు ఇప్పటికీ క్రేజ్ ఉంది. ఈ సినిమాను మార్చి 14న గ్రాండ్ రీ-రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. దీంతో థియేటర్లలో మరోసారి "రేయ్.. ఎవర్రా మీరంతా.." అనే డైలాగ్ హెూరెత్తడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, అమెరికాలో ఈ చిత్రాన్ని రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాలో రీమా సేన్, ఆండ్రియా జెరెమియా హీరోయిన్లుగా నటించారు. సెల్వరాఘవన్ డైరెక్ట్ చేసిన ఈ కల్ట్ క్లాసిక్ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించాడు.

# నేడే దాయాదుల పోరు

- భారత్ - పాకిస్థాన్ మధ్య నేడే పోరు
- చాంపియన్స్ ట్రోఫీలో హై ఓల్టేజ్ మ్యాచ్

**బలగం టీవీ, హైదరాబాద్**



చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ నేడు జరుగనుంది. దుబాయ్‌లో జరుగనున్న ఈ మ్యాచ్ కోసం ప్రపంచ క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌ను పాకిస్థాన్ ఓడించి సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు అందుకు ప్రతీకారం తీర్చుకునేందుకు టీమిండియా సిద్ధంగా ఉంది.

ఇక చాంపియన్స్ ట్రోఫీ 2025లో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 6 వికెట్లు తేడాతో విజయం సాధించిన రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండగా, న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ 60 పరుగుల తేడాతో ఓటమిని మూటగట్టుకుంది. సెమీ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఇరు జట్లకు ఈ మ్యాచ్‌లో ఎంతో కీలకం.

మ్యాచ్ ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ను స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18 ఛానెల్స్ లో లైవ్ చూడొచ్చు. ఓటీటీలో అయితే జియోహాట్ స్టార్ లో వీక్షించొచ్చు.

ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటి వరకు టీమిండియా - పాకిస్థాన్ ఐదు సార్లు ఢీకొన్నాయి. అయితే ఇందులో మూడు సార్లు పాకిస్థాన్ విజయం సాధించగా.. టీమిండియా రెండు సార్లు గెలుపొందింది. 2004, 2009 ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ గెలవగా.. 2013లో భారత్ విజయాన్ని ఎగరేసుకుపోయింది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ మాత్రం గ్రూప్ స్టేజ్‌లో భారత్ విజయం సాధించినప్పటికీ.. తుది పోరులో పాకిస్థానే ట్రోఫీని ముద్దాడింది.

# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా

- ఛాంపియన్స్ ట్రోఫీలో రికార్డులు
- 352 పరుగుల టార్గెట్ ను 47.3 ఓవర్లలోనే ఛేదించిన ఆసీస్
- 86 బంతుల్లో 120 పరుగులు చేసిన జోష్ ఇంగ్లిస్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఛాంపియన్స్ ట్రోఫిలో ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. 351 ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇదే రికార్డు స్కోరు అనుకుంటే, ఇంగ్లాండ్ సాధించిన ఈ కళ్లు చెదిరే స్కోర్ నే ఛేజ్ చేసి 356 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసింది ఆస్ట్రేలియా. ట్రావిస్ హెడ్ (6), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (5) స్వల్ప స్కోర్లకే అవుటైన స్థితిలో... ఇంగ్లిస్ బ్యాట్ తో వీరవిహారం చేశాడు. 86 బంతుల్లో 120 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడి స్కోరులో 8 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. ఇంగ్లిస్ కు తోడు ఆఖర్లో గ్లెన్ మ్యాక్స్ వెల్ కూడా విజృంభించడంతో ఆస్ట్రేలియా జట్టు మరో 15 బంతులు మిగిలుండగానే... 47.3 ఓవర్లలో 5 వికెట్లకు 356 పరుగులు చేసి విజయభేరి మోగించింది. ఫటాఫట్ ఇన్నింగ్స్ ఆడిన మ్యాక్స్ వెల్ 15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 32 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ఆసీస్ ఇన్నింగ్స్ లో ఓపెనర్ మాథ్యూ షార్ట్ (63), అలెక్స్ కేరీ (69) అర్ధసెంచరీలతో రాణించారు. మార్నస్ లబుషేన్ 47 పరుగులు చేశాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో మార్క్ ఉడ్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, అదిల్ రషీద్, లియామ్ లివింగ్ స్టన్ తలో వికెట్ తీశారు.

లాహెూర్ లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో... టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. దాంతో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు ఓపెనర్ బెన్ డకెట్ (165) భారీ సెంచరీ సాయంతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 351 పరుగులు చేసింది. జో రూట్ (68బీ 78 బంతుల్లో 4 ఫోర్లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

# 'ఛావా' సినిమాకు మోడీ ప్రశంసలు

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ ఛావా . మరాఠా మహారాజు ఛత్రపతి శివాజీ కుమారుడైన శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ పాత్రలో నటుడు విక్కీ కౌశల్, శంభాజీ మహారాజ్ సతీమణి పాత్రలో రష్మిక మందన్నాఅద్భుతంగా నటించి మెప్పించారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ సినిమా తొలి షోతోనే బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఛావాపై ప్రశంసలు కురిపించారు. 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఛావా సినిమాను ప్రశంసించారు. 'ఛావా సినిమా గురించే ప్రస్తుతం దేశం అంతటా టాక్ వినిపిస్తోంది. దేశంలో మరాఠీ భాష చాలా గొప్ప దళిత సాహిత్యాన్ని అందించింది. మహారాష్ట్ర ప్రజలు గతంలో సైన్స్, ఆయుర్వేదం, లాజికల్, రీజనింగ్ వంటి వాటికి అద్భుతమైన కృషి చేశారు. మహారాష్ట్ర, ముంబై నగరం కేవలం హిందీ సినిమాలు మాత్రమే కాకుండా మరాఠీ చిత్రాల స్థాయిని పెంచడంలోనూ కీలకపాత్ర పోషించాయి.' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.




# టీవీలో 'సంక్రాంతికి వస్తున్నాం'..

**బలగం టీవీ, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్ హీరోగా బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం . ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్‌హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. ఈ సినిమాను ఓటీటీ కంటే ముందుగా టీవీలో టెలికాస్ట్ చేయబోతున్నారు. మార్చి 01 సాయంత్రం 6 గంటలకు జీతెలుగులో ఈ సినిమా ప్రీమియర్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ చిత్రం ఓటీటీ తేదీ మరింత ఆలస్యం కాబోతున్నట్లు తెలుస్తుంది.